www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 17 ఏప్రిల్ 2025
5
అన్నమయ్య

ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మండలంలోని పొన్నూటిపాళ్యం సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉచ్చులో చిక్కుకున్న చిరు తను రక్షించడంలో అటవీ అధికారులు తీవ్ర వైఫల్యం చెందారని, ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరి పించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న చిరుత ఉచ్చుకు చిక్కుకుంటే దానిని కాపాడడంలో అధికారుల వైఫల్యం కళ్ళకు కట్టినట్టు కనబడుతోందన్నారు. చిరుతను కాపాడలేకపోయిన అధికారులు, ఒకవేళ అదే చిరుత జనావాసాల్లోకి వచ్చి ఉంటే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. నెలకు వేలల్లో జీతాలు తీసుకుంటూ, అటవీ ప్రాంతాల వైపు కన్నెత్తి చూడ కుండా తమ ఉద్యోగాలను కేవలం మామూళ్లు దండుకోవడానికి ఉపయోగించుకుంటున్నారని, రైతులను భయభ్రాంతులకు గురి చేయడంతో పాటు అటవీ ఫలసాయం పైన ఆధారపడి జీవించే వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. పొన్నూటిపాలెం, చీకలబైలు తదితర ప్రాంతాల్లో చిరుత బారిన పడి కొన్ని గొర్రెలు, మేకలు, ఆవులు చనిపోయిన విషయం అధికారుల దృష్టికి వచ్చినా, చిరుత సంచారం ఉందని తెలిసినా ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు.

కరెంటు కోత.. ఉక్కపోత..

- అప్రకటిత కోతలతో జనం ఉక్కిరిబిక్కిరి
- దోమల మోతతో బెంబేలెత్తుతున్న జనం
- అల్లాడిపోతున్న పిల్లలు, వృద్ధులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అసలే వేసవి కాలం..ఆపై కరెంట్ కోతలు.. రెండూ కలిపి ప్రజలకు ఉక్కపోత..ఇదీ జిల్లాలో దుస్థితి. మాడు పగిలే ఎండలతో ఉదయం 9 దాటితే బయటకు రావాలంటేనే బెంబేలెత్తుతున్న ప్రజలు ఇంట్లోనే సేద తీరుదామన్నా కరెంటు లేక నానా అవస్థలు పడుతున్నారు. ఉక్క పోతలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న జనాలు ప్యానో, కూలరో వేసుకొని భానుడి తాపం నుంచి ఉపశమనం పొందాలనుకుంటే విద్యుత్ శాఖ అధికారులు అనధికార, అప్రకటిత విద్యుత్తు కోతలతో ప్రజలను విసుగెత్తిస్తున్నారు. మెయింటినెన్స్ డే అన్న పేరుతో వారాని కోసారి ఐదు నుంచి ఆరు గంటల పాటు విద్యుత్తు కోతలు విధిస్తూనే మరోవైపు ప్రతిరోజు అడ్డదిడ్డంగా విద్యుత్ సరఫరా నిలిపేస్తుండడంతో ప్రజలు ఇళ్లలో కూడా ఉండలేని పరిస్థితి దాపురించింది. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా విద్యుత్తు కోతలు విధిస్తూ సమాచారం కోసం విద్యుత్ శాఖ సిబ్బంది, అధికారులను చరవాణి ద్వారా సంప్రదిస్తే సరైన సమాధానం చెప్పే నాధుడే లేడని ప్రజలు వాపోతున్నారు. ఓవైపు ఉక్క పోతలు, మరోవైపు కరెంటు కోతలతో చిన్నపిల్లలు, వృద్ధులు వేసవి తాపానికి అల్లాడిపోతున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరికి ప్రజలు అసహనం వ్యక్తం చేస్తూ ఇకనైనా అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్తును అందించాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు. విద్యుత పంపిణీ సంస్థల నుంచి వినియోగానికి సరిపడా పంపిణీ కాకపోవడంతో అనధికారికంగా కోతలు పెడుతున్నట్లు తెలుస్తోంది.

కోతలు లేకుండా సరఫరా చేయాలి

పగలు, రాత్రి అన్న లేడా లేకుండా కరెంటు పోతోంది. ఉక్కపోత, వేడితో తీవ్రఇబ్బందులు పడ్డాం. వృద్ధులు, చిన్న పిల్లలు మరింత ఇబ్బందిపడ్డారు. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కోతలు లేకుండా కరెంటు సరఫరా చేయాలి.

- జి.గాయత్రి, గృహిణి, విద్యుత్‌నగర్.

మూడురోజుల నుంచి ఎక్కువగా తీసేస్తున్నారు

ఎండలు పెరిగిపోయాయి. పగటి వేళల్లో ఇళ్లలో ఉండలేని పరిస్థితి. రాత్రి వేళల్లో వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటోంది. కరెంటు తీసేస్తున్నారు. గత రెండు మూడు రోజులుగా మరి ఎక్కువగా కరెంటు పోతోంది.

- లక్ష్మిదేవి, గృహిణి, రాజంపేట.

పిల్లలు ఇబ్బంది పడుతున్నారు

తరచూ విద్యుత్తు కోతలు విధిస్తుండడంతో ఉక్కపోతకు చిన్న పిల్లలు ఇంట్లో ఉండలేక ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఏ చెట్టు కిందనో సేదతీరుదామనుకున్నా ఎక్కడా చెట్టు జాడే కనబడటం లేదు. ప్రతి నెలా వెన్ను విరిచి కరెంటు బిల్లులు వసూలు చేస్తున్నారు. విద్యుత్తు శాఖ అధికారులు అంతరాయం లేని విద్యుత్తును అందించలేకపోతున్నారు.

- కోడూరు నాగరాజ, ఊటుకూరు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యుత్తు అధికారులు

విద్యుత్తు సమస్యలపై ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ విద్యుత్తు శాఖలో ఇస్తారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు మున్సిపాలిటీ పరిధిలో సైతం కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎంత సేపు ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. విద్యుత్తు శాఖలో ఉన్నత అధికారుల నుండి కిందిస్థాయి సిబ్బంది వరకు వినియోగదారుల పట్ల చాలా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఆ శాఖలోని ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించే విధంగా చర్యలు చేపట్టాలి.

-టి.హరికృష్ణ, డి.బి.ఎన్.పల్లె.

ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్యం ఖరీదు
రెండేళ్ల చిరుత మృత్యువాత

- చిరుతను రక్షించడంలో అధికారుల వైఫల్యం
- గంటల తరబడి నరకయాతన అనుభవించిన వైనం
- ఉచ్చుకు బిగుసుకుపోయి, అలసిపోయి మృతి
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహించిన గ్రామస్తులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అటవీ ప్రాంతంలో వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకున్న చిరుత పులిని రక్షించే క్రమంలో ఫారెస్ట్ అధికారులు పూర్తి వైఫల్యం చెందారు. వారి నిర్లక్ష్యం కారణంగా రెండేళ్ల వయసున్న ఆడ చిరుత బలైపోయింది. అధికారులు చిరుతను రక్షించేందుకు వేగంగా నిర్ణయాలు తీసుకోలేదు. సంఘటనా స్థలానికి వచ్చిన తర్వాత ఎక్కడో 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుపతి జూ అధికారులను ఫోన్ల ద్వారా సంప్రదింపులు జరిపి సలహాలు, సూచనల కోసం ప్రయత్నం చేశారు తప్ప, అప్పటికే గంటల తరబడి ఉచ్చుకు తగులుకుని గిలగిలా కొట్టుకుంటున్న చిరుతకు కనీసం నీటిని అందించే ఏర్పాటు కూడా చేయలేక పోయారు. అధికారుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహించారు. కేవలం అధికారుల నిర్లక్ష్యం వల్లే చిరుత చనిపోయిందని విమర్శలు గుప్పించారు. మదనపల్లె మండలం పొన్నేటిపాలెం సమీపంలోని అడవిలో బుధవారం తెల్లవారుజామున నీటి కోసం పొలాల వైపు వచ్చిన సుమారు రెండేళ్ల వయసున్న ఆడ చిరుతపులి వన్యప్రాణుల కోసం వేటగాళ్లు వేసిన ఉరిలో చిక్కుకుంది. ఉదయం 5 గంటల నుంచి చిరుత అరుపులు విన్న గ్రామస్తులు పొలాల దగ్గరకి వెళ్లి ఉచ్చుకు చిక్కుకున్న చిరుత గమనించి ఫారెస్ట్ అధికారులకు సమాచారాన్ని చేరవేశారు. ఉదయం ఎనిమిది గంటలకే సమాచారం అందుకున్న ఫారెస్ట్ సిబ్బంది బీట్ ఆఫీసర్లు సుమిత, జయరాం, ఉమాదేవి సంఘటనా స్థలానికి చేరుకొని విషయాన్ని ఎఫ్ఆర్ఓ జయ ప్రసాద్ రావు, సబ్ డిఎఫ్ఓ శ్రీనివాసులకు చేర వేశారు. అధికారులు చిరుతను వీలైనంత త్వరగా రక్షించేందుకు తీసుకోవలసిన ప్రణాళికలతో సంఘటనా స్థలానికి చేరుకోలేదు. అక్కడికి వచ్చిన తర్వాత బోను కావాలని, డాటెడ్ గన్ కావాలని, శిక్షణాత్మలైన డాక్టర్లు కావాలని చర్చించు కుంటూ తిరుపతిలో ఉన్న జూ అధికారులను ఫోన్‌లో సంప్రదించారు. ఉచ్చుకు బిగిసుకున్న చిరుత విడిపించుకోవడానికి గంటల తరబడి నరకయాతన అనుభ వించింది. ఈ విషయం సమీప ప్రాంతాల్లో దావణంలా వ్యాపించడంతో చిరు తను చూసేందుకు జనం ఎగబడ్డారు. ఈ దశలో గ్రామస్తులు ధైర్యం చేసి సార్ పాపం.. చిరుత చనిపోతుంది సార్.. నీళ్లైనా పెట్టించే ఏర్పాటు చేయించండి. లేదా మమ్మల్ని అయినా పంపండి.. నీళ్లు పెడతామని ప్రాధేయపడినా పట్టించుకోని అధికారులు ముందు మీరు ఇక్కడి నుంచి వెళ్ళండి అంటూ వారిని అక్కడి నుంచి పంపేసే ప్రయత్నం చేశారు తప్ప చిరుతను కాపాడేందుకు ఒక చిన్న ప్రయత్నం చేయకపోవడం విచారకరం. ఈ క్రమంలో గంటల తరబడి పైకి కిందికి, అటు ఇటు తిరుగుతూ ఉచ్చు నుండి తప్పించుకోవడానికి విశ్వప్ర యత్నాలు చేసిన చిరుత ఆఖరికి మిన్నుకుండు పడిపోయి కదలిక లేకుండా పోయింది. ఎంతసేపటికి చిరుత చలనం లేకపోవడంతో గ్రామస్తులు ధైర్యం చేసి సార్ మేము నీళ్లు పెడతామంటూ అధికారులను బతిమాలి చిరుత దగ్గరికి చేరు కున్నారు. అప్పటికే చిరుత విగతజీవిగా పడిపోయింది. గ్రామస్తులు ఒక్కసారిగా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు చోద్యం చూడ్డానికే ఇక్కడికి వచ్చారు తప్ప చిరుతను కాపాడేందుకు ఒక చిన్న ప్రయత్నం చేయలేదని ఆగ్రహించారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే చిరుత చనిపోయిందని విమర్శలు గుప్పించారు. ఆఖరికి చిరుత మృతదేహాన్ని కిందకి దింపి పోస్టుమార్టం నిమిత్తం పశువుల ఆసుపత్రికి తరలించారు. కాగా మృతి చెందిన చిరుత గర్భిణి అని పోస్టు మార్టం నివేదికలో వెల్లడైంది. చిరుత కడుపులో రెండు పిల్లలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. మరో ఇరవై రోజుల్లో కాన్పుఅయ్యేదని తెలిపారు. తల్లి చిరుత మృతితో కడుపులోనే రెండు చిరుత పిల్లలు మృత్యువాత పడ్డాయి.

మృతి చెందిన చిరుత　　ఉచ్చులో చిక్కుకున్న చిరుత

అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

పని చేయని గన్ : చిరుతను కాపాడే ప్రయత్నంలో మత్తు మందు ఇచ్చేందుకు ఫారెస్ట్, వెటర్నరీ అధికారులు సంఘటనా స్థలానికి మత్తు మందు ఇచ్చే గన్ తెచ్చారు. అది పని చేయకపోగా చిలుము పట్టిపోయింది. కొంతసేపు విశ్వప్రయత్నం చేసి ఇది పనిచేయదని పక్కకు పెట్టేశారు. రెస్క్యూ ఆపరేషన్ చేసేందుకు వచ్చిన అధికారులు ఇలాంటి పరికరాలతోనా వచ్చేదని విమర్శలు వెల్లువెత్తాయి.

ఫారెస్ట్ అధికారులను సస్పెండ్ చేయాలి

ఉచ్చులో చిక్కుకున్న చిరుతను కాపాడలేని ఫారెస్ట్ అధికారులను సస్పెండ్ చేయాలి. సినిమా డైరెక్టర్ వలే ఫోజులు కొట్టారే తప్ప కాపాడ్డానికి ఒక్క ప్రయత్నం చేయలేదు. చిరుతకు నీళ్లందించేందుకు గ్రామస్తులు, రైతులు ముందుకు వచ్చినా అనుమతించలేదు. ఎండవేడిమికి తట్టుకోలేకన చిరుత బలైపోయింది.

- మదన్ మోహన్‌రెడ్డి, గ్రామస్తుడు, పొన్నేటిపాలెం.

అధికారులు తీవ్ర వైఫల్యం

చిరుత ప్రాణాలు రక్షించడంలో అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారు. అడవిలో సాహసం చేయలేని వారికి అటవీ శాఖలో ఉద్యోగులు ఎందుకు. చిరుతకు నీళ్లు అందించి ఉంటే ప్రాణాలతో బయటపడేది. ఈ ప్రయత్నం చేయకపోవడంతోనే ప్రాణాలు విడిచింది అధికారులపై చర్యలు తీసుకోవాలి.

- మోహన్‌రెడ్డి, రైతు, పొన్నేటిపాలెం.

ఉచ్చులు వేసిన వారిపై చర్యలు

వన్యప్రాణుల వేట కోసం ఉచ్చులు వేసిన వారిపై చర్యలు తప్పవని సబ్ డిఎఫ్ఒశ్రీనివాసులు హెచ్చరించారు. వైల్డ్ లైఫ్ 1972 యాక్ట్ ప్రకారం వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరమని, మరీ ముఖ్యంగా ఉచ్చులు వేయడం తీవ్రమైన నేరంగా పరిగణించడం జరుగుతుందన్నారు. ఇలాంటి వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చిరుతను రక్షించేందుకు అవసరమైన పరికరాలు, ట్రైనర్స్ మనకు అందుబాటులో లేరు. తిరుపతి జూ పార్కునుంచి వారు వచ్చేలోపు చిరుత మృతి చెందడం దురదృష్టకరం.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.వి.రమణ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ఏళ్ల తరబడి పనిచేసినా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీవితాల్లో మార్పు లేదని ఇప్పటికయినా కూటమి ప్రభుత్వం వారి గోడు విని ఆదుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బివి రమణ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రాష్ట్ర కమిటి పిలుపు మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇంజినీరింగ్ కార్మికుల ధర్నాకు ముఖ్య అతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పని గంటలు పెంచి కేవలం రూ.15 వేల వేతనం ఇస్తున్నారని పారిశుధ్య కార్మికులతో పాటు రూ.21 వేలు వేతనం ఇవ్వాలన్నారు. వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచి ఆప్కాస్ కొనసాగించాలని లేనిపక్షంలో పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమపథకాలు అమలు చేయాలని, రక్షణ పరికరాలతో పాటు నాణ్యమైన పనిముట్లు సరఫరా చేయాలన్నారు. హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేయకపోవడాన్ని కార్మికుల్ని దగాచేయడం కాదా అని ప్రశ్నించారు. వాటర్ సెక్షన్ అధ్యక్షులు అక్బర్, కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ పెరిగిన ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆప్కాస్ కొంసాగించి ప్రవేట్ ఏజెన్సీ లకిచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజల నుండి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన చెందారు. నీటి కొరత నివారణకు పాలక అధికార యంత్రాంగం చర్యలు చేపట్టి ప్రజల ఆక్రోషం నుండి కాపాడాలని తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కార్మికులు దేవా, రమేష్ శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, మౌనిక, రమణ పాల్గొన్నారు.

రాయచోటి : మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు రమణ

మదనపల్లె : మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

మదనపల్లె అర్బన్ : ఆప్కాస్‌లో పని చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు అన్నారు. బుధవారం మదనపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంఖ్యను పెంచి పని భారం తగ్గించాలని, మృతి చెందిన పారిశుధ్య కార్మికుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. బకా యిలు విడుదల చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను పట్టించుకోక పోవడం దుర్మార్గమన్నారు. మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని, పట్టణ విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని కోరుతుంటే అందుకు భిన్నంగా ఉన్న కార్మికులును మస్టర్‌లో హాజరు వేసుకుని ఇంటికి వెళ్లే కార్మికులకు అధికారులు వత్తాసు పలుకుతూ మిగిలిన కార్మికులపై పనిబారం పెంచుతున్నారని తెలిపారు. మదనపల్లి మున్సిపాలిటీలో నలుగురు పారిశుధ్య కార్మికులను బలవంతంగా రిటైర్ చేసి వారికి ఇవ్వాల్సిన బెనిఫిట్స్ ఇవ్వక పోవడం దారుణమన్నారు. నాయకులు జి.కృష్ణమూర్తి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం విడనాడాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ వరపన మనూజరెడ్డి, కమిషనర్ ప్రమీలకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు చలపతినాయుడు, సాంబశివనాయక్, రామకృష్ణ, గోపాల్, కృష్ణప్ప, శ్రీనివాసులు, శ్రీరాములు, రమణమ్మ, రఘునాథ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

విద్యతోపాటు విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో వాటిని సాధించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో పీలేరు శ్రీ చైతన్య విద్యార్థులు ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ వారు నిర్వహించిన పోటీ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గ్రాండ్ ప్రైజ్ (లాప్ టాప్) టాబ్, ఫస్ట్ ప్రైజ్ తో పాటు గోల్డ్ మెడల్స్ సాధించిన పీలేరు శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులను కలెక్టరు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికి వారు సాధించిన ల్యాప్ టాప్, ట్యాబ్, గోల్డ్ మెడల్, సర్టిఫికెట్లను బహుకరించి అందరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎజిఎం సురేష్, ఆర్ఐ శ్రీధర్, ప్రిన్సిపల్ సుమన్ గౌడ్, అకడమిక్ కో-ఆర్డినేటర్ రవికుమార్, డీన్ జానకిరామ్, ప్రైమరీ ఇన్‌ఛార్జి సునంద పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న కలెక్టర్ శ్రీధర్

విద్యార్థిని అభినందిస్తున్న గురుప్రసాద్

గిన్నిస్ రికార్డులో 'జ్ఞానాంబిక' విద్యార్థికి చోటు

ప్రజాశక్తి-మదనపల్లె

స్థానిక శ్రీ జ్ఞానంబికా జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ ఎంఇసి చదువుతున్న ఎస్.జైత్ర మాధుర్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు తీసుకున్నట్లు కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. ఈ సర్టిఫికెట్ శాస్త్రీయ నృత్యంలో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన నృత్య ప్రదర్శనలో 4218 మంది పాల్గొనగా జైత్ర మాధుర్ నృత్యం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్‌లో రికార్డు అయిందన్నారు. వీరి గురువు బాలాజీ 5 సంవత్సరలనుండి శ్రీలలిత కళ ఆర్ట్స్ ద్వారా మాధుర్‌కు శిక్షణ ఇస్తున్నారు. మాధుర్ తల్లి దండ్రులు మాధుర్ ను ప్రోత్సహించారు. మధుర యొక్క సాధన గిన్నిస్ బుక్ అవార్డు ను వరించిందన్నారు. కార్యక్రమంలో శ్రీ జ్ఞానంబికా జూనియర్ కళాశాల కరెస్పాండంట్ ఆర్.గురు ప్రసాద్, ప్రిన్సిపల్ వెంకటా చలపతి, రమాదేవి, డాన్స్ మాస్టర్ బాలాజీ, మాధుర్ తల్లిదండ్రులు పార్వతి, మహేష్ పాల్గొన్నారు. మాధుర్‌ను కరెస్పాండంట్ గురు ప్రసాద్ అభినందించారు.

'మిట్స్'లో జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియం

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపం లోని మిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియంను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిథిగా బెంగళూరుకు చెందిన ఎంవిపి, మైక్రోసాఫ్ట్ అజురే ఎస్.పూర్ణిమా, పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న తాజా టెక్నాలిజీ పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని అన్నారు. అందుకు మైక్రోసాఫ్ట్ స్టూడెంట్స్ క్లబ్ ద్వారా విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం, నాయకత్వ నైపుణ్యాలు, గ్లోబల్ టెక్నాలజీ ట్రెండ్స్‌పై అవగాహన పెంచుకోవడానికి వీలు కల్పించవచ్చని అన్నారు. విద్యార్థులు మైక్రోసాఫ్ట్ టూల్స్, క్లౌడ్ కంప్యూటింగ్ (అజుర్), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ వంటి రంగాల్లో లోతైన జ్ఞానం పొందగలుగుతారు. ప్రాజెక్టులు, హ్యాకథాన్‌ల ద్వారా ప్రాక్టికల్ అనుభవాన్ని పొందటంతో పాటు, నాయకత్వ నైపుణ్యాలు మెరుగుపడతాయని చెప్పారు. విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో టెక్నాలజీ రంగంలో ఎదగడానికి మైక్రోసాఫ్ట్ స్టూడెంట్స్ క్లబ్ గొప్ప మార్గదర్శిగా నిలుస్తుందని అన్నారు. ప్రతి విద్యార్థి జాబ్ కావాలంటే లెర్న్, అడాప్ట్, స్కిల్ చేంజింగ్ ఎబిలిటీ అనే మూడు క్వాలిటీలు తప్పనిసరని ఆమె సూచించారు. విభాగాధిపతి డాక్టర్ దినేష్, డీన్ కంప్యూటర్ సైన్స్ బాసాభి చక్రబర్తి, కన్వీనర్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న పూర్ణిమ

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అగ్నిప్రమాదాల నివారణపై అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా బుధవారం మదనపల్లి అగ్నిమాపక కేంద్రం నుంచి పట్టణంలో స్థానిక అధికారి శివప్ప ఆద్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వేసవి కాలంలో అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, అగ్నిమాపక కేంద్రం సిబ్బంది తమ వాహనాలతో ప్రదర్శన నిర్వహిస్తూ, ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ అవగాహన ప్రదర్శన ఫైర్ స్టేషన్ నుంచి చిత్తూరు బస్టాండ్ సర్కిల్, టౌన్ బ్యాంక్ సర్కిల్ మీదుగా స్థానిక బెంగళూరు బస్టాండ్ సర్కిల్ వరకు ముందుకు సాగింది. బెంగళూరు బస్టాండ్ వద్ద అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని నియంత్రించడానికి అగ్నిమాపక సిబ్బంది వివిధ రకాల అగ్నిమాపక విన్యాసాలను ప్రజలకు చేసి చూపించడం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విపత్తు నిర్వహణ, అగ్నిమాపక అధికారి పి.అనిల్ కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాలుగా జరిగే అగ్ని ప్రమాదాలను విభిన్న పద్ధతుల్లో అదుపులోకి తీసుకు రావాల్సి ఉంటుందన్నారు. ఆయిల్, ప్లాస్టిక్, గ్యాస్, గోడౌన్స్, గృహాల్లో జరిగే వాటిని అదుపు చేయడానికి ఉపయోగించే పద్ధతులను ప్రజలకు వివరించారు. అలాగే అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ఎటువంటి జాగ్రత్తలు పాటించాలని అగ్నిమాపక శాఖ అధికారి జి.శివప్ప తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది, పోలీస్ శాఖ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన అగ్నిమాపక విన్యాసాలు అబ్బురపరచడంతోపాటు ప్రజలను ఆకట్టుకున్నాయి.

ప్రజలకు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని గోపిదిన్నె ఉన్నత పాఠశాల క్లస్టర్ పరిధిలో 24 ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ బుధవారం విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆ విద్యా సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలకు రుణాలు : కలెక్టర్

బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ఎస్‌సిల స్వయం ఉపాధి పథకాలకు బ్యాంకర్లు వందశాతం రుణాలు ఇవ్వాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో 2025-26లో ఎస్‌సి కార్యాచరణ ప్రణాళిక కింద ఎపి ఆన్‌లైన్ బెనిఫిషరీ మేనేజ్మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టం వెబ్‌సైట్ ద్వారా ఎస్‌సిల స్వయం ఉపాధి పథకాలకు రుణాల మంజూరు అంశంపై బ్యాంకర్లతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌సిలకు ఉపాధి కల్పన, స్వయం ఉపాధికి ప్రోత్సాహం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ మేరకు 2025-26లో ఎస్‌సి ప్రణా ళిక కింద జిల్లాకు 563 యూనిట్లను కేటాయించినట్లు తెలిపారు. ఈ 563 యూనిట్లకు వివిధ సెక్టార్లలో రూ.2341లక్షలు రుణాలు ఇవ్వాలని, రూ.924 లక్షలు 40శాతం మేర రాయితీగా పరిగణి స్తారని చెప్పారు. ఈ కార్యాచరణ ప్రణాళిక అమలుకు ప్రభుత్వం కాలపరి మితిని నిర్దేశించిందన్నారు. కమిటీ ద్వారా ఎంపిక చేసిన అర్హుల వివరాలను ఎస్‌సి కార్పొరేషన్, ఎంపిడిఒలు సమన్వయంగానాన్‌లైన్‌లో నమోదు చేస్తారని చెప్పారు. ఇందుకు సంబంధించి తగిన కార్యాచరణ రూపొందించుకొని అర్హులైన వారందరికీ రుణాలు అందించాలన్నారు. బ్యాంకుల వారీగా ఇచ్చిన లక్ష్యాలను తప్పనిసరిగా అధిగమించాలని బ్యాం కర్లకు సూచించారు. స్వయం ఉపాధి పథకాల ద్వారా ఎస్‌సిలకు రుణాలు అందించడంతో వారి కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధిలోకి వస్తాయన్నారు. ఈ ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన విధివిధానాలను పాటించి కాలయాపన చేయకుండా త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలన్నారు. అర్హుల ఎంపికకు సంబంధించి ఎంపిడిఒలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురాలని తెలిపారు. వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీ డ్రోన్లను ఉపయోగించడం ద్వారా అత్యుత్తమమైన ఫలితాలను పొందేందుకు ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర ప్రభుత్వం రైతన్నలకు చేయూతను అందిస్తోందన్నారు. వ్యవసా యంలో డ్రోన్ వినియోగం పెంచడానికి కూడా రుణాలు అందించాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. జిల్లాకు 34 డ్రోన్ యూనిట్లు మంజూరు కావడం జరిగిందిన్నారు. ఒక్కొక్క బృందంలో ఐదు మంది సభ్యులతో యూనిట్ ఏర్పాటు చేస్తారు అన్నారు. 80 శాతం రాయితీతో డ్రోన్ యూనిట్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటన్నట్లు తెలిపారు. బ్యాంకులు కేవలం 20 శాతం మాత్రమే రుణాలు అందించాలని పేరొకన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జెడి చంద్రనాయక్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు, వివిధ బ్యాంకర్లు, పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సూర్యనారాయణ

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-నందలూరు

నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఆరవపల్లెలో విశ్రాంత రైల్వేఉద్యోగి రైల్వే భారత్ స్కౌట్ గ్రూప్ కమిషనర్ కమల్‌బాషా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ జంబు సూర్యనారాయణ ప్రారంభించారు. తొలిరోజు ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రైల్వే ద్వారా ఉన్నత సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందినా కూడా ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పం ఎంతో గొప్పదన్నారు. ఇలా ప్రతి ఒక్కరూ తమ వంతు ప్రజా సేవలు చేయాలన్నారు. ప్రజలకు చల్లటి తాగునీటిని అందుబాటులో ఉంచడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో అరవపల్లె షాదిఖానా అధ్యక్షులు మహబూబ్ బాషా, గుండ్లూరు మాజీ నీటిసంఘం అధ్యక్షులు ముమ్మడి వేణుగోపాల్‌రెడ్డి టిడిపి షేక్ మౌలానా, పల్లెనాగయ్య, కానకుర్తి వెంకటయ్య, ఆంజనేయులు, గురుప్రసాద్, గ్రామస్తులు వెంకటేశు, గంగిరెడ్డి పాల్గొన్నారు.

దోబిఘాట్‌లో మోటర్‌కు మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని గున్నికుంట్ల రోడ్డు వద్ద ఉన్న దోభిఘాట్ బోరు, మోటరు మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వాసు బాబుకు జిల్లా రజక సంఘం అధ్యక్షులు టి.రమేష్‌బాబు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా బోరు మోటరు పని చేయక పోవడంతో దుస్తులను ఉతికి జీవనోపాధి పొందుతున్న రజకులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మిగిలిన దోభిఘాట్ల వద్ద కూడా తగిన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని చెప్పారని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసులు, ఆనంద్ పాల్గొన్నారు.

30 లోపు పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-రామాపురం

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు పెంపకానికి దరఖాస్తులు చేసుకునే రైతులు ఈనెల 16 నుంచి 30లోపు దరఖాస్తులు తీసుకోవాలని ఉపాధి హామీ ఎపిఒ పెంచలయ్య పేర్కొన్నారు. ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కింద ఉద్యానవన పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకునే రైతులు ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగి ఉండాలన్నారు. చిన్న సన్నగా రైతులుగా తహశీల్దార్ ధృవీకరించాలని, ఐదు ఎకరాలు తక్కువ భూమి కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగల రైతులు 30లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాస్‌బుక్, సన్న చిన్న కారు రైతుగా తహశీల్దార్ ధ్రువీకరించిన పత్రము, పండ్ల తోటలో సాగు చేసే భూమి ఫోటో, రైతు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, జాబ్ కార్డు, బోరుబావి నీటి ఆధారం ఉన్నవారు , విద్యుత్ బిల్లు జిరాక్స్, భూమి మట్టి నమూనాలో సాయిల్ టెస్టింగ్ కార్డు దరఖాస్తుతో పాటు జత చేయాలన్నారు. మరిన్నీ వివరాలకు జాతీయ ఉపాధి హామీ ఎపిఒగా గానీ, క్షేత్రస్థాయి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్ గాని రైతులు సంప్రదించాలని అన్నారు.

ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు అర్హులైన వారు ఒబిఎంఎంఎస్ సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడిఒ దిలీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు గలవారు కుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, సెక్టారుకు సంబంధించిన అర్హతల సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 10వ తేదీ వరకు దరఖాస్తుకు చివరి తేదీ అని తెలిపారు. సెక్టార్లకు సంబంధించిన స్కీములు, అర్హతల జాబితాను ఎంపిడిఒ కార్యాలయంలో అందుబాటులో ఉందన్నారు. మరిన్నీ వివరాలకు ఎంపిడిఒ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని ఎస్‌సిలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి-కలికిరి

పోషకాహారంతోనే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని ఎంఎలహెచ్ఒ నాగరాణి పేర్కొన్నారు. స్థానిక మండల కేంద్రంలో బుధవారం కలికిరి-3 అంగనన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్తలకు జీనత్‌బి ఆధ్వర్యంలో పోషకాహార పక్షోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు,బాలింతలు, చిన్న పిల్లల తల్లులకు పాలు, గుడ్లు, ఆకుకూరలు లాంటి పోషక ఆహారాలు ఎంతో అవసరమని అన్నారు. పాలు, గుడ్లుతో పాటు బాలామృతం ఖర్జూరం, చిక్కీలు లాంటి పోషక ఆహారాల పదార్థాలను ఇవ్వడం జరుగుతుందని అన్నారు. రకరకాల కూరగాయలతో ఐసిడిఎస్ సింబల్‌ను వేసి ఘనంగా పోషక ఆహార పక్షోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు. కార్య క్రమంలో గర్భిణులు, బాలింతలు,చిన్నపిల్లలు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న నాగరాణి

మదనపల్లె పురపాలక సంఘము

ఈ-ప్రొక్యూర్మెంటు టెండరు నోటీసు

ఆర్.ఓ.సి. నెం.1394/E1/2025 తేది: 16.04.2025

మదనపల్లె పురపాలక సంఘము నందు క్రింద తెలిపిన పనులకు గాను ఈ-ప్రొక్యూర్మెంటు ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది.

వ. నెం	నిధులు	టెండర్ ఐ.డి.లు	పని అంచనాల మొత్తము
1	పురపాలక సాధారణ నిధులు (19 పనులు)	800956	రూ. 31.61 లక్షలు
2		800970, 800989, 801001, 801028, 801033, 801035, 801041, 801046, 801049, 801051, 801054, 801077, 801125, 801141, 801156, 801167, 801172 & 801237	రూ. 111.26 లక్షలు

పై పనులకు సంబంధించిన పూర్తి వివరముల కొరకు వారి e Procurment market place నందు చూడవలెను మరియు ఆఫీసు పనివేళలందు సంబంధిత అధికారులను సంప్రదించగలరు.

వరుస నెం. 1

బిడ్ డాక్యుమెంటు డౌన్‌లోడ్ చేసుకొనుటకు మొదలు తేది : 16.04.2025 : 11.00 AM

బిడ్ డాక్యుమెంటు డౌన్ లోడ్ చేసుకొనుటకు చివర తేది : 25.04.2025 : 11.00 AM

బిడ్ డాక్యుమెంటు స్వీకరించుటకు చివర తేది : 25.04.2025 : 11.15 AM

వరుస నెం. 2

బిడ్ డాక్యుమెంటు డౌన్‌లోడ్ చేసుకొనుటకు మొదలు తేది : 16.04.2025 : 11.00 AM

బిడ్ డాక్యుమెంటు డౌన్ లోడ్ చేసుకొనుటకు చివర తేది : 03.05.2025 : 11.00 AM

బిడ్ డాక్యుమెంటు స్వీకరించుటకు చివర తేది : 03.05.2025 : 11.15 AM

షరతులు : ఏ కారణము తెలుపకుండా టెండరును పాక్షికముగా కాని, పూర్తిగా కాని రద్దపరచుటకు/ నిరాకరించుటకు కమీషనరు వారికి పూర్తి అధికారములు కలవు.

కమీషనరు
మదనపల్లె పురపాలక సంఘము.

గాలివానకు నేలకొరిగిన అరటి, మామిడి

- పరిశీలించిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

నియోజకవర్గంలోని వైకోట గ్రామానికి చెందిన రైతులు పండించిన అరటి, మామిడి తోటలు గత రాత్రి కురిసిన వాన గాలికి నేలకొరిగాయి. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, టిడిపి యువ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి పంట నష్ట పోయిన తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వం ద్వారా తగిన పరిహారం అందించేందుకు తగిన చర్యలు తీసు కుంటామని వారు రైతులకు హామీ ఇచ్చారు. ఉద్యాన శాఖ అధికారులు పంట నష్టం సంబంధించిన అంచ నాలను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించాలని అన్నారు. పంట చేతికి వచ్చే సమయానికి ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టపోవడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలాజీ, కమతం నాగరాజు, జోగినేని మణి, రెడ్డిబాబు, పాల్గొన్నారు.

దెబ్బతిన్న అరటి పంటను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ శ్రీధర్

గాలివాన బీభత్సం

బి.కొత్తకోట: పట్టణంలో బుధవారం సాయంత్రం గాలివాన భీభత్సం సృష్టించింది. సాయంత్రం 6 గంటలకు అకస్మాత్తుగా ఉరుములు,మెరుపులతో కూడిన వర్షం కురిసింది.గాలివాన ధాటికి చెట్లు నేలమట్టమయ్యాయి. మరో రెండు రోజులపాటు ఉరుములతో కూడిన వర్షాలు ఉన్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులు సూచించారు.

రేషన్ బియ్యం అందలేదంటూ మహిళలు ఆవేదన

రేషన్‌బియ్యం కోసం ఆందోళన చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని బిసి కాలనీలో కొన్ని కుటుంబాలకు రేషన్‌బియ్యం సకాలంలో ఇవ్వడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం పలువురు మహిళలు మాట్లాడుతూ రేషన్‌బియ్యం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నిస్తే,రేషన్ బియ్యం లోడ్ తక్కువగా వచ్చిందని, ప్రభుత్వం ఇచ్చిన రేషన్ బియ్యం సరఫరా చేసామని, ఈనెల ఇవ్వడానికి రేషన్ బియ్యం లేదని, మీకు రేపు నెల ఇస్తామని చెబుతున్నారని అన్నారు. కూలీలు చేసుకునే జీవనం సాగించే మేము రేషన్ బియ్యం ఇవ్వకపోతే ఏం తినాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.సంబంధిత అధికారులు కనీసం ఈ విషయంపై స్పందించకపోవడం దుర దృష్టకరమన్నారు. ఓవైపు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అంటూ గొప్పలు చెబుతున్నా, ఏ ఒక్క పథకం సకాలంలో అందడం లేదన్నారు. ప్రస్తుతం రేషన్ బియ్యం సైతం పంపిణీ చేయడంలో అధికారులు, కూటమి నాయకులు పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ దీనిపై స్పందించి రేషన్ బియ్యం లబ్ధిదారులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గొప్ప సంఘ సంస్కర్త 'కందుకూరి'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

సమాజంలో పాతుకుపోయిన మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ఆ జన్మాంతం పోరాడిన గొప్ప సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ అన్నారు. బుధవారం తెలుగుజాతి నవయుగ వైతాళికుడు, ఆధునిక సమాజ పితామహుడు కందుకూరి వీరేశలింగం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. మండలంలోని చింతపర్తి జడ్‌పి ఉన్నత పాఠశాలలో వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం వితంతు వివాహాలను ప్రోత్సహించడం, బాల్య వివాహాలను నిరోధించడానికి విశేష కృషి చేశారన్నారు. తొలి తెలుగు నవల రాసిన కందుకూరి 130కి పైగా గ్రంథాలు రాశారని ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రెడ్డెప్ప రెడ్డి, ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, దామోదర, రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** కందుకూరి వీరేశలింగం పంతులు గొప్ప సంఘసంస్కర్త, రచయిత,మొట్ట మొదటి వితంతు పునర్వివాహాన్ని ఆంధ్రప్రదేశ్ నందు జరిపించిన సంస్కరణ శీలి అని మండల విద్యాశాఖ అధికారులు రెడ్డి శేఖర్, భీమేశ్వరచారిలు పేర్కొన్నారు.స్థానిక ఎంఆర్‌సిలో కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధం, సతీసహగమన నిషేధం, స్త్రీ విద్య ప్రోత్సాహం, అంటరానితనంనిర్మూలన మొదలగు సంఘంలో ఉన్నటువంటి మూఢాచారాలను నిర్మూలించుటకు తన రచనల ద్వారా తన ప్రసంగాల ద్వారా కృషి చేసిన మహనీయుడు అని కొనియాడారు.ఆంధ్రప్రదేశ్ ప్రజల చేత దక్షిణ భారతదేశ ఈశ్వరచంద్ర విద్యాసాగర్ కీర్తి గడించిన సంస్కరణ యోధుడు,తన యావదాస్తిని సంస్కరణలకు ఉపయోగపడే విధంగా దానం చేసిన ఆ మహనీయుడిని అందరూ స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వీరేశలింగం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

శాంతి భద్రతలను పరిరక్షించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో మీ ముద్ర ఉండాలని మదనపల్లె డిఎస్‌పి ఎస్.మహేంద్రను కాంగ్రెస్ పార్టీ మదనపల్లె నియోజకవర్గ నాయకులు ఎస్.రెడ్డీ సాహెబ్ కోరారు. బుధవారం డిఎస్‌పిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపడమే కాకుండా శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిఎస్‌పిని కోరారు. పోలీసులకు మా పార్టీ నుంచి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

సబ్ కలెక్టర్, డిఎస్‌పిలను కలిసిన నిగార్ సుల్తానా

మదనపల్లె నూతన డిఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.మహేంద్రను , మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌ను బుధవారం అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షులు నిగార్ సుల్తానా మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వారికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సింగం రామకృష్ణారెడ్డి, లత, శిరీషా, రమణలతో కలసి ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మదనపల్లి పట్టణం, డివిజన్ పరిధిలో యువ అధికారులు ప్రజలకు ఉత్తమ సేవలను అందించి మదనపల్లి పేరును మరింతగా ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు.

ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలి :సిఐ

ప్రజాశక్తి-కలికిరి

ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సిఐ

వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిం చాలని సిఐ రెడ్డిశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు ద్విచక్ర వాహన దారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని,మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇచ్చినచో వాహన యజమానిపై కేసు నమోదు చేయబడుతుందని, రెండోసారి అలా జరిగితే వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమం కానిస్టేబుల్ భూషణ, పోలీస్ సిబ్బంది ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE XI ADDITIONAL DISTRICT JUDGE, PILER

M.V.O.P. No. 06 OF 2014

V.Basha @Chand Basha. ...Petitioner

Vs

N.Varadappan and others ...Respondents

NOTICE TO RESPONDENT NO. 3

C. Manikyam, S/o Chinnappa, r/at D.No: 3-98E, Gandhi Nagar, Mitturu, Kodalam Post, Vellore Taluk, Namakkal District, Tamilnadu.

Whereas the above named petitioner had filed the above MVOP petition for grant of compensation. If you have got any objection, you may appear before this Court at 10:30 AM on 21-04-2025 either in person or through an advocate and file your objection. If you fail to do so, the matter will be decided ex-parte.

//By Order of Court//

C. VENKATA RAMANA REDDY, B.Com., B.L.,
Advocate,
PILER.

బిసి వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలి

-బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితకు వినతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : బిసి సంక్షేమ వసతి గృహల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, మౌలిక వసతులను త్వరితగతిన ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర రెవెన్యూ, బిసి సంక్షేమ శాఖల మంత్రులను వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు పొదల నర్సింహులు కలసి వినతి పత్రం అందించారు. బుధవారం అమరావతి సచివాలయంలో రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మను వారి వారి ఛాంబర్లులో వేర్వేరుగా కలిసినట్లు తెలిపారు. మదనపల్లి నియోజకవర్గం,డివిజన్ పరిధితో పాటు ఇతర ప్రాంతాల్లోని బిసి సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు చదువుకోవటానికి, ఉండటానికి అనువైన వాతావరణం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మౌలిక సదుపాయాల కొరత, సమస్యల తీవ్రత విద్యార్థుల ఫలితాలపైన ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం బిసి వసతి గృహాల్లో విద్యార్థులు చక్కగా చదువుకోటానికి మౌలిక సదుపాయాలతో ఆరోగ్య కరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో బిసి నాయకులు పాల్గొన్నారు.

సమాజ భాగస్వామ్యంతోనే వ్యాధుల నియంత్రణ

ప్రజాశక్తి-మదనపల్లె : సమాజ భాగస్వామ్యం తోనే దోమకాటు ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు జ్వరాలను నియంత్రణ , వ్యాప్తి ని అరికట్టవచ్చు అని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, సబ్ యూనిట్ అధికారి ఖలీలున్నాఖాన్ పేరొన్నారు. డిఎంహెచ్ఒ ఆదేశాల మేరకు మదనపల్లి మండలంలోని సిటిఎం ప్రాథమిక ఆరోగ్య పరిధిలోని కొత్తపేట, బసినికొండ ఏరియాలలో ప్రజలు, విద్యార్థులకు అవగాహనా సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్ రఫీ మాట్లాడుచు ఈ ఐదు రకాల జ్వరాలు ప్రజారోగ్యానికి ప్రమాదకరమని అన్నారు. ఇటీవలే ప్రభుత్వం మలేరియా వ్యాధిని నోటిఫైయబల్ వ్యాధిగా గుర్తించిందని అన్నారు.తీవ్ర జ్వరం, చలి, తలనొప్పి, నీరసం, వాంతులు, వికారం,కనుగుడ్లు పక్కకు తిప్పలేకపోవడం, శరీరం పై దద్దులు, రక్తకణాల సంఖ్య తగ్గిపోవడం, కీళ్లనొప్పులు వంటి లక్షణాలు ఈ జ్వరాలలో కనిపిస్తాయని అన్నారు. వ్యాధి లక్షణాలు ను బట్టి రక్తపరీక్షలు చేయించుకుని,సకాలంలో చికిత్స పొందితే ప్రాణాపాయం ఉండదని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి,నీటి నిల్వలు పై మూతలు ఉంచుకోవాలని, దోమతెరలు వాడాలని, కిటికీలకు మెష్ కొట్టించుకోవాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యం ఉంటేనే దోమలపై దండయాత్ర విజయవంతం అవుతుం దన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-రాయచోటి

మంత్రి రామానాయుడుకు వినతి అందిస్తున్న మదన్‌మోహన్‌రెడ్డి

పట్టణ సమీపంలో ఉన్న కంచాలమ్మ గండి చెరువును, మాండవ్యనదిని అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును అర్చన విద్యాసంస్థల కరెస్పాం డెంట్ డాక్టర్ పాపిరెడ్డి మదనమోహన్ రెడ్డి కోరారు. మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం విజయవాడలో జలవనరుల శాఖ మంత్రి రామానాయుడును కలిసినట్లు తెలిపారు. కంచాలమ్మ గండి చెరువుకు 500 ఎకరాల ఆయకట్టు భూమి ఉందని సాగునీరు, తాగునీరు చెరువుగా అభివృద్ధి చేయాలని, రాయచోటి పట్టణానికి కూతవేటు దూరంలో ఉండడం, నగరవనం ప్రక్కనే ఈ చెరువు ఉన్నందున పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని అన్నారు. ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించినట్లు అయన తెలిపారు. టిడిపి నాయ కులు పోలు మేఘనాధరెడ్డి, బసిరెడ్డి,ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

మృతురాలి భర్త బాబుకు ప్రమాద భీమా సొమ్ము అందిస్తున్న ఎస్‌జిబి మేనేజర్ వినోద్

సురక్ష బీమా నగదు అందజేత

ప్రజాశక్తి - రామసముద్రం

మండలంలోని చెంబకూరు పంచాయతీలోని కోట వీధికి చెందిన బాబు భార్య నూరున్నిసా గత ఆరు నెలల క్రితం ఓ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఆమె సుభాష్ పొదుపు సంఘంలో సభ్యురాలుగా ఉండేది. సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ వినోద్ నాడు సురక్షా బీమా ఇన్సూరెన్స్ ఆమె పేరున నమోదు చేశారు. దీని ఫలితంగా ఆమె మరణానంతరం ఆమె కుటుంబీకులకు రావాల్సిన బీమా సొమ్మును బుధవారం స్థానిక బ్యాంక్ లో మృతురాలి భర్తకు నగదు అందించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ 18 నుంచి 70 సంవత్సరాల మధ్య వయస్సు గల ఎవరైనా భారతీయ పౌరులు ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజనలో నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. ప్రస్తుతం ఇన్సూరెన్స్ అనేది ప్రతి ఒక్కరికి అవసరమని అన్నారు. జీవితంలో ఏ క్షణంలో ఏం జరుగుతుందో చెప్పలేని పరిస్థితులు ఉన్నాయని అన్నారు. అనుకోని ప్రమాదం జరిగినప్పుడు కుటుంబ పెద్ద మరణించడం లేదా అంగవైకల్యానికి గురైనప్పుడు అతని కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అందుకే ఇన్సూరెన్స్ అనేది ప్రతి ఒక్కరికి ఉండాలని తెలిపారు. సామాన్య ప్రజల్లో చాలా మంది యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించలేని పరిస్థితులు ఉందని అన్నారు. ఈ క్రమంలో సామాన్య ప్రజలకు సైతం ప్రమాద బీమా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన తెచ్చిందని సంవత్సరానికి కేవలం రూ.20 నామ మాత్రపు ప్రీమియంతోనే రూ.2 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తోందని అన్నారు. ఈ బీమా సౌకర్యాన్ని డ్వాక్రా మహిళలందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉద్యాన కళాశాలలో ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో బుధవారం విద్యార్థులకు ప్లేస్ మెంట్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. చిట్వేలికి చెందిన కెవెస్‌సి ఫాం కేర్ ప్రవేట్ లిమిటెడ్ సంస్థ ఎండి వెంకటేష్, టెక్నికల్ ఆఫీసర్ తేజ విద్యార్థులకు ఇంటర్వ్యూలు జరిపారు. సంస్థ కార్యక్రమాలు వివరించారు. 21 మంది విద్యార్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరైనట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిటి.శ్రీనివాస్, ప్లేస్ మెంట్ సెల్ ఇంచార్జ్ డాక్టర్ ఎస్.బి.రమ్యలక్ష్మి తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-రామాపురం

విద్యార్థులు చదువుతోపాటు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొంది చుకోవాలని ఎస్‌బిఐ లైఫ్ రిటైర్డ్ మేనేజర్ నాగరాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని బిట్స్ కళాశాల విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై ఆర్‌హెచ్‌జిబి ఎంఎంఎస్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరా స్యత పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ యువత ఎక్కువగా ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగులు ఆడుతూ ఆర్థిక అక్షరాస్యత లేక ఇష్టం వచ్చినట్లు తమ ఖాతాలోని డబ్బులను వృధా చేస్తు మోసపోతున్నారన్నారని అన్నారు. మరి కొంతమంది తమ జీవితాల్లోనే నాశనం చేసుకుంటున్నారని అన్నారు. బ్యాంక్ సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వ బీమా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్‌బిఐ ఎల్‌టిఎం ఆంజనేయులు మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ తమ ఖాతాలకు నామిని ఆధార్, పాన్ కార్డు , మొబైల్ నెంబర్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు. తమ ఖాతాలు వివరాలను ఎవరు తెలియకుండా గోప్య ంగా ఉంచుకో వాలని సూచించారు. కళాజాత బృందంతో పాటలు రూపంలో మ్యాజిక్ రూపంలో విద్యార్థు లకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఆర్‌హెచ్ జిబి ఎంఎస్ఎస్ సంస్థ ప్రతినిధులు రాచరాయుడు, కె.వెంకటేష్ ఎం.వెంకటయ్య, నాగవేణి పాల్గొన్నారు.

ఆవుకు అరటిపండు తినినిస్తున్న జగన్‌మోహన్‌రాజు

పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం :'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సిఎం చంద్రబాబు సారథ్యంలో రాజంపేటకు మంచి రోజులు వచ్చాయని, ప్రతి టిడిపి నాయకుడు, కార్యకర్త కలసికట్టుగా పనిచేసి రాజంపేటలో టిడిపి గౌరవం నిలబెడదామని, ప్రతిపక్షాలను మట్టి కరిపించి రాజంపేటలో టిడిపి జెండా ఎగరాలంటే అభివృద్ధి , సంక్షేమం ప్రతి గ్రామంలో నెలకొల్పాలని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మేకవారిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా గోమాతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో బలమైన కార్యకర్తల బలం ఉన్న పార్టీ టిడిపి అని, టిడిపికి అభివృద్ధి, సంక్షేమం తొడవుతే భవిష్యత్తులో టిడిపికి తిరుగు లేదని, కావున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యం లో కలసికట్టుగా పని చేసి రాజంపేట లో టిడిపి జెండా ఎగరవేద్దాం అని పిలుపునిచ్చారు. నాయకులకు, కార్యకర్తలకు అన్ని విధాల అండగా ఉంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి ముఖ్య నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మహిళలకు భరోసా శక్తి యాప్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : విపత్కర పరిస్థితులలో మహిళలు, యువతులకి శక్తి యాప్ రక్షణ కల్పిస్తుందని శక్తి టీమ్ ఇంచార్జ్ ఎస్ఐ గాయత్రి పేర్కొన్నారు. బుధవారం శక్తి బృందం సిబ్బందితో కలిసి చైతన్య నర్సింగ్ కళాశాల యందు విద్యార్థునులకు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, బాల్య వివాహాల వల్ల కలుగు నష్టాల గురించి తెలియజేసి వాటి నుంచి శక్తి యాప్ ద్వారా ఎలా రక్షణ పొందాలో వివరించారు. ప్రస్తుత సమాజంలో మహిళలు, యువతులపై అఘాత్యాలు జరుగుతున్నాయని, వాటిని నివారించడానికి ప్రభుత్వం ఈ యాప్‌ని తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు.కళాశాల విద్యార్థినులు తమ మొబైల్‌లో ఈ యాప్ కలిగి ఉండాలన్నారు. ఎవరైనా ఆకతాయిలు వేధించినా, అల్లరి చేసినా ధైర్యంగా మా దృష్టికి తీసుకొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టిడిపి రాష్ట్ర పరిశీలకులుగా కెకె.చౌదరి

ప్రజాశక్తి-చిట్వేలి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు రాష్ట్ర తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస యాదవ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కెకె చౌదరిని నెల్లూరు సిటీ నియోజకవర్గానికి రాష్ట్ర పార్టీ పరిశీలకులుగా నియమించారు. ఈ సందర్భంగా కెకె మాట్లాడుతూ పార్టీ పెద్దలు నా మీద పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ఆంధ్రప్రదేశ్ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణతో కలిసి నెల్లూరు సిటీ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి, పార్టీ నాయకులు, కార్యకర్తలకు సమన్వ యానికి కృషి చేస్తానని తెలిపారు. మండల పార్టీ అధ్యక్ష పదవి నుంచి రాష్ట్రస్థాయిలో ఉన్నత పదవులు అధిరోహించే స్థాయికి వెళ్లడం ఎంతో హర్షించదగ్గ విషయమని స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.